గత జీవితం గూర్చి ఆలోచిస్తున్నాడు.

"ఆరవయేండ్ల బతుకుల నలుపయేండ్లు బీమండిలనే గడిసింది—పుట్టి బుద్దెరిగి నప్పటినుంచి మరమగ్గాల మీన్నే పనిచేసిన. చెవులు గిల్లు మనే గడబిడలో ఒకల మాట ఇంకొకలకినబడది—ఒక్కన్నే నాలుగ యిదు మిషిన్లు సూసుకోవాలె. పోగుతెగితే గబగబా అతుకు పెట్టడు. అటూ ఇటూ పరుగు. మొగ్గాల నుంచి అచ్చే పొడితోనే దగ్గు మొదలయింది. బొక్కలు దేలినయి. అయినా పని తగ్గలేదు పని సేసి సేసి అలిట్టకచ్చి ఇంటికత్తె సాపెలు పన్నా లేని జాగలో ఉండుడు. గట్టిగా కాళ్లు సాపుతే బోల్లు తలుగుడు. ఒక్క అర్రలనే నడుమ పరదాలు గట్టుకొని కొన్ని కుటుంబాలుండుడు. పరదలేపితే అంతా బయరంగం ఏం మాట్లాడినా, దగ్గినా ఏం చేసినా పక్కవాళ్ళకు తెలుస్తది. పెండ్లాం-మొగలు కలిసున్నా అడ్లనే వుండాలె—ఏకాంత మంటె తెలువది ఏ సెరిసగం రాత్రో అందరు పడుకున్నరని నమ్మకం అయినంక భయం భయంగా భార్యపై చేయివేసుడు ఎవరన్నా చూస్తున్నారేమోనని, వింటున్నారేమోనని... భయం. భయం భయంగానే కాపురాలు చేసుడు అందుకోసమే ఎప్పుడో ఓసారి కొన్ని రోజుల కోసమే భార్యను తెచ్చుకొనేది. ఏటా ఓ సారి ఊరికి పొయ్యేచ్చేది. కడుపునిండ తినుటానికి వరన్నం దొరుకది. జొన్న రొట్టో, గోదుమ రొట్టో తినుడు. అన్నం తింటే పండుగన్నట్టే ఇన్ని కష్టాలుపడి అందరికీ దూరమయచ్చి ఏం సంపాయిచ్చినట్టు? దుబ్బ... మల్ల పొల్ల గండ్ల కన్న ఏం మిగులుకనే పాయె. ఊళ్ళకచ్చేటప్పుడు తెల్ల బట్టలు, జబ్బకో రేడియో, సేతికి గడియారంతో వచ్చుడు. కొద్ది రోజులుండి మల్ల పొయ్యేటప్పుడు వాట్నే అమ్ముకోనో, కుదవబెట్టో పోవుడు ఇది ఆనవాయితిగ సాగుతుంది—వెయిల పెట్టువడుంటె దుకాణం పెట్టుకొని బ్రతుకవచ్చు. కాని నా అసోంటోనీకేడ దొరుకాలె—?"

మొండయ్య కళ్ళలో నీరు.

భీమండిలో జరిగిన మత కలహాల దృశ్యం జ్ఞాపకమొచ్చి వణికి పోతాడు మొండయ్య. అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండేవారు హిందూ ముస్లిం కార్మికులు ... బ్రతకడానికొచ్చిన వాళ్ళలో ఏ భేదాలూ కనబడేవి కావు—ఒకరి కష్టాల్లో ఒకరు పాలుపంచుకునేవారు ఏ ఆపదొచ్చినా ఒకర్నొకరాదుకునేవారు. ఎవరంటించారో, ఎవరు రగిల్చారో చిచ్చు? తెల్లవారేసరికి ఊర్నిండా హాహాకారాలు? కత్తిపోట్లు-ఆర్తనాదాలు రోడ్లన్ని రక్తమయం. ఎవరిండ్లో వాళ్లు గజగజా వణుకుతూ తలుపు లేసుకున్నారు. ఎవర్నెవరు పొడుస్తున్నారో తెలియదు. ఎందుకు పొడుస్తున్నారో తెలియదు. గృహదహనాలు, లూటీలు, ఒకమతంవార్ని ఇంకో మతం వారు నరుక్కోవడం, నానా భీభత్సం, గందగోరళం. మొండయ్య! అతని ఊరు వాళ్ళు కొందరు బజార్లలో రక్తపు మడుగుల్లో! అడుగులు పెడ్తూ, శవాలను దాటుతూ భయం భయంగా రైల్వే స్టేషన్ చేరుకున్నారు పొట్టచేత బట్టుకొని వచ్చిన ఎంతో మంది అమాయకులు బలయ్యారు అతి కష్టంగా రైలెక్కి ఇల్లు చేరుకున్నారు...ఆ దృశ్యాలు జ్ఞాపకంవచ్చి కళ్ళ వెంట నీరు కారింది మొండయ్యకు. భర్తదిక్కు చూసిన నర్సమ్మ-

"ఏంది ఏడ్తున్నవేంది"? అంది

..ఏం లేదు...ఏం లేదు' అని కళ్లు తుడుచుకున్నాడు మొండయ్య.

"అవ్వా! బువ్వెయ్యి జెప్పన....బస్సు యాల్లయితంది. ఈ బస్సుల కర్నాగురం పొయ్యి అన్నూంచి నిజామాబాద్ పోతే బండి దొరుకుద్ది" అన్నాడు ఇంటిలోకి ప్రవేశిస్తూనే రాజేశం.

ఇంతలో కోడలు కూడా వచ్చింది...

ఇద్దరికీ అన్నం వడ్డించి కొసరి కొసరి తినిపించింది నర్సమ్మ. ఇదివరకే సర్దివున్న సంచులతో భార్యతో సహా బస్టాండు దిక్కు నడుస్తున్నాడు రాజేశం...వెంటనడుస్తున్న మొండయ్య, నర్సమ్మ ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారు కొడుక్కూ కోడలుకూ—ఏడుస్తున్న వాళ్ళను

యిరుగు పొరుగు వాల్లు ఓదార్చారు.

"బిడ్డ అందరితో మంచిగ కలిసుండు. కొట్లాటలు పెట్టుకోకు. బొంబా యిల మరాటోల్లుకానోల్లు ఉండద్దన్ని శివసేనోల్లో ఎవలో లొల్లి జేత్తండ్రు ఆ లొల్లి బీమండి దాకత్తె సప్పుడుజేక రా! అద్దంటే ఇంటలేకపోతివి" అని బస్సు కదిలెంత వరకూ ఏదేదో చెబుతూనే వున్నాడు మొండయ్య. నర్సమ్మలు—బస్సు కనుమరుగయేంత వరకూ చూసి ఇంటి దిక్కు కదిలారు.

"నిన్ను కన్నందుకేం పంచియ్యలేదుగని బిడ్డ నాతీరుగ ఊరిడిసి పెట్టి పోవుడయితే సీకు తప్పలేదు—" తనలో తానే అనుకుంటూ పుట్టెడు దుఃఖంతో ఇల్లు చేరుకున్నాడు మొండయ్య.

జీవగడ్డ ఆదివారం అనుబంధం జూలై 7, 1985